వైఎస్ఆర్-అన్నమయ్య
వార్త
మంగళవారం 11 జూన్ 2024

### జెఈఈ అడ్వాన్స్ లో
## ఆల్ ఇండియా ర్యాంకు 227 సాధించిన రైతు బిడ్డ



చిన్నమండెం, జూన్ 10, ప్రభాత వార్త : మండలంలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లెకు చెందిన సుదర్శన్‌రెడ్డి, రెడ్డి ఈశ్వరిల కుమారుడు కుమారకాల్వ ప్రభాకర్‌రెడ్డి ఇటీవల రాసిన జెఈఈ అడ్వాన్స్‌లో ఆదివారం వెలువడిన ఫలితాలలో ఐఐటి ఆల్ ఆల్ ఇండియా ర్యాంకు 227 సాధించాడు. రైతు కుటుంబంలో పుట్టిన సరస్వతి పుత్రుడుగా కొనియాబడ్డాడు. ప్రభాకర్‌రెడ్డి హైదరాబాద్ చైతన్యలో చదువుతూ ఈ ర్యాంకు సాధించడంతో పాటు ఈడబ్ల్యూఎస్‌లో 18వ ర్యాంకు పొందాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రభాకర్‌రెడ్డిని అభినందించారు.

## జేఈఈ అడ్వాన్స్‌లో 207వ ర్యాంకు సాధించిన విష్ణువర్ధన్



రామాపురం, జూన్ 10, ప్రభాతవార్త: ఆదివారం విడుదల చేసిన 2024 జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో బొందల విష్ణువర్ధన్ ఆల్ ఇండియా ఓబీసీ కేటగిరిలో 207వ ర్యాంకు సాధించి తన సత్తా చాటుకున్నారు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నల్లగుట్టపల్లె గ్రామం కొత్తపల్లెకు చెందిన బొందల నాగరత్నమ్మ, విశ్వనాథ్(టీచర్) ల చిన్న కుమారుడు విషష్ణువర్ధన్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో ఆలిండియా కేటగిరిలో 207 ర్యాంక్ సాధించి అటు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకువచ్చారని ర్యాంక్ సాధించడం పట్ల గ్రామస్థులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

### బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు
## ప్రణాళిక బద్దంగా ముందుకెళ్లాలి



రాయచోటి, జూన్ 10, ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బాల కార్మికుల నిర్మూలనపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిల్లలను కార్మికులుగా మార్చకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఇందుకోసం అధికారులు హోటళ్లు, పరిశ్రమలు, మెకానిక్ షాపుల్లో తరచూ తనిఖీలను నిర్వహిస్తూ బాలలను పనిలో పెట్టుకున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూన్ 1 నుంచి 30 వరకు జిల్లాలో బాల కార్మికులను గుర్తించి వారిని రీహ్యాబిటేషన్ చేయడంతో పాటు బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యాజమాన్యాలపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో బాల కార్మికుల నిర్మూలనకు మండల స్థాయి కమిటీలు నిర్వహించి హోటళ్లలో పరిశ్రమలలో తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. చిన్న చిన్న ఫ్యాక్టరీలు, గ్రైనైట్స్ తయారీ, ఇటుకల తయారీల బాల కార్మికులుంటే వెంటనే సంబంధిత యాజమాన్యంపై కేసులు నమోదు చేయించాలన్నారు. పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం చేపట్టాలన్నారు. 1 నుంచి 18 సంవత్సరాల్లోపు పిల్లందరూ పూర్తి సమయం పాఠశాలల్లో ఉండేలా విద్యాశాఖాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాల కార్మికుల నిర్మూలనపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లేబర్ ఆఫీసర్ రంగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.కొండయ్య, విద్యాశాఖాధికారులు, ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.

# కంచే చేను మేస్తే...



పోరుమామిళ్ల, జూన్ 10 ప్రభాతవార్త : ఆయన ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. ఎక్కడ పనిచేసినా ప్రభుత్వ భూములను స్వాహా చేయడమే ఆయన నైజం. ఆయన అల్లుడు కూడా ఓ తహశీల్దారు. దీంతో వీరిఅవినీతికి అడ్డు అదుపు లేకుండా పోతోంది. ఆ విశ్రాంత తహశీల్దారు పనిచేసిన ప్రతి మండలంలో భూములు కాజేయడం, అమ్ముకోవడం ఆయన నైజం. కాశినాయన మండలంలో పనిచేస్తునపుడు ఆయన సొంత అయిన వరికుంట్ల, ఆయన సమీప పంచాయతీ బాలాయపల్లెలో బినామీ పేర్లుతో దాదాపు 30 ఎకరాలు కాజేసినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.అలాగే పోరుమామిళ్ల గోడౌన్‌లో పనిచేస్తునపుడు కూడా ప్రజలకు వెళ్లాల్సిన నిత్యావసర సరుకులు అన్నింటిని మిల్లులకు ఎత్తి కోట్లు కూడగొట్టుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన పనిచేసిన ఏ మండలంలో కూడా వివాదాస్పదం కాకుండా అందరినీ అన్ని పార్టీల వారిని మేనేజ్ చేసుకుంటూ కోట్లు కూడపెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. గోడౌన్ నుంచి వెళ్లిన తర్వాత వివిధ మండలాలలో తహశీల్దారుగా, డిప్యూటి తహశీల్దారుగా పనిచేస్తూ ఆయన చేసిన అవినీతికి అడ్డు, అదుపు లేకుండా పోయిందని ప్రజలు అనుకుంటున్నారు. బద్వేలు తాలూకాలోని గోపవరం మండలంలో పనిచేస్తున్నపుడు అటు బద్వేలు, గోపవరం మండలాలలో వందలాది బినామి ఇంటి స్థలాలు మంజూరుచేసి కోట్లు సంపాదించినట్లు ప్రజలు అనుకుంటున్నారు. అందులో భాగంగానే రిటైర్‌మెంటు అయిన తర్వాత పోరుమామిళ్లకు నివాసం మార్చి ఇక్కడ ఓ కోటి రూపాయలపైన ఇల్లు కట్టుకుని నివాసం చేస్తున్నారు.విశ్రాంత ఉద్యోగి తన పలుకుబడి ఉపయోగించుకుని బాలాయపల్లె పొలంలో దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని డీకేటి పట్టాలుగా పొంది అల్లుడి అండతో కొంత భూమిని2023వ సంవత్సరంలోనే ఆన్‌లైన్ చేయించుకుని ఆయన పొందిన డీకేటీ పట్టాల మధ్యలో రిజిష్టర్ భూమి ఉన్నా ఆ భూమికి దారి లేకుండా ఈయన సంపాదించిన బినామీ ఆస్తులన్నింటిని దున్ని రిజిష్టర్ భూమికి దారి లేకుండా చేస్తున్నారు. రిజిష్టర్ భూమి గల బాధితుడు తన భూమికి ఆనుకుని ఉన్న ఎకరా పొలాన్ని వారి పెద్దల నుంచి కొనుగోలు చేసి అరటిచెట్లు నాటుకుంటే వాటిని చదును చేసి అక్రమంగా పొందిన డీకేటీ భూములను ఆయన పూర్తిగా చదును చేసుకుని చుట్టూ ముళ్ల తీగ బిగించుకున్నాడు. ఒకవేళ నీకు పొలం ఉంటే ఉండవచ్చు. కానీ సాగులో ఉన్న భూమి అందునా అరటి చెట్లు నాటుకున్న భూమిని ఎవరి అనుమతితో చదునుచేసి ఆ ముళ్ల తీగవేసారో జిల్లా అధికారులు తేల్చాల్సి ఉంది.

ఈ విషయమై సదరు బాధితులు కోర్టులో దావా వేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అంతేకాక 594/1, 594/2, 595, 596,596/2, 582 సర్వేనెంబర్లకు సంబంధించి సంబంధిత భూయజమానురాలు ఎపుడో 10 సంవత్సరాల క్రితం చనిపోగా 7 నెలల క్రితం వీరి పలుకుబడితో సర్వే చేయించుకున్నారు. ఇది ఎలా సర్వే చేయించారో దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాల్సి ఉంది. మొత్తం మీరు చేసిన అక్రమాలు మరియు మీ ఉద్యోగంపై త్వరలో అధికారులు నిజం నిగ్గుతేల్చేందుకు ముందుకు వసా్తరని ప్రజలు ఆశిస్తున్నారు.

తహశీల్దారు వివరణ: సంబంధిత అంశంపై విచారిస్తున్నాం, త్వరలో సమస్యను పరిష్కరిస్తాం ఫీల్డ్‌లో భాగంగా పొలాల వద్దకు వచ్చి పరిశీలించి అందరికీ సరైన న్యాయం చేస్తాం.

## జిల్లాలో 14 మంది సీఐలు, ఎస్సైలకు తాత్కాలిక పోస్టింగ్‌లు

– ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ

కడప క్రైం, జూన్ 10, ప్రభాతవార్త: కడప జిల్లాలో పనిచేస్తున్న సీఐలు, ఎస్సైలకు తాత్కాలిక పోస్టింగ్‌లు ఇస్తూ జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 8 మంది సీఐలు, 6 మంది ఎస్సైలు ఉన్నారు. పోస్టింగ్‌లు ఇచ్చిన వారిలో కడప సైబర్ క్రైంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వి.శ్రీధర్‌నాయుడును పెండ్లిమర్రి పీఎస్‌కు బదిలీ చేశారు. కడప ఏహెచ్‌టీయూ విభాగంలో పనిచేస్తున్న ఎ.మధుమల్లేశ్వర్‌రెడ్డిని వి.ఎన్.పల్లెకు, కడప పీసీఆర్‌లో ఉన్న ఎం.వెంకటేశ్వర్లును వల్లూరుకు, కడప వీఆర్‌లో ఉన్న జె.శివశంకర్‌ను తొండూరుకు, కడప రెడ్‌షాండల్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న నారాయణ యాదవ్‌ను చక్రాయపేటకు, కడప సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎం.రాంభూపాల్‌ను రాజుపాలెం పీఎస్‌కు, కడప సోషల్ మీడియా సైబర్ క్రైంలో పనిచేస్తున్న సి.దేవకిరణ్‌కుమార్‌ను దువ్వూరుకు బదిలీ చేశారు. అలాగే కడప డీటీసీలో పనిచేస్తున్న ఆర్‌పీఎస్సై డి.సి.హెచ్.పుల్లయ్యను గోపవరం పీఎస్‌కు, కడప సీసీఎస్‌లో పనిచేస్తున్న సి.హెచ్.వెంకటరమణను అట్లూరుకు, కడప ఫ్యాక్షన్ జోన్‌లో పనిచేస్తున్న జి.మల్లికార్జునను ఎస్‌పి కాశినాయన పీఎస్‌కు, కడప ట్రాఫిక్ అప్‌గ్రేడ్ పీఎస్‌లో పనిచేసే కె.నజీర్ హుసేన్‌ను తలమంచిపట్నం పీఎస్‌కు, కడప డీసీఆర్‌బీలో పనిచేసే ఎం.రాజారెడ్డిని మైలవరంకు ప్రొద్దుటూరు పీసీఆర్‌లో పనిచేసే నారాయణస్వామిని కలమల్ల పీఎస్‌కు బదిలీ చేశారు. వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని ఎస్పీ ఈ సందర్భంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## మర్యాదపూర్వక కలయిక

కడప వైద్యవిభాగం, జూన్ 10, ప్రభాతవార్త: విజయవాడలో నారా చంద్రబాబునాయుడు నివాసంలో సోమవారం కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు శ్రవణ్ రాజ్‌రెడ్డి, శ్రియాంకరె డ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పు ష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



## నిత్య కృషీవలుడు ప్రధాని నరేంద్రమోదీ



– భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్

వేంపల్లె, జూన్ 10, ప్రభాతవార్త : నిత్య కృషీవలుడు ప్రధాని నరేంద్రమోదీ అని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. కేంద్రంలో 3వ సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రమోదీకి శుభాకాంక్షలు తెలుపుతూ వేంపల్లెలోని ప్రియాతోట రామాలయంలో సోమవారం ఎన్డీఏ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ దేశంలో భాజపాకు సుదీర్ఘంగా పరిపాలన చేసేందుకు అవకాశం కల్పించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. దేశంలో దశాబ్దాల కాలం నుండి అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలను పరిష్కరించిన ఘనత నరేంద్రమోడీకి దక్కుతుందన్నారు. దేశంలో గత పదేళ్లుగా అభివృద్ధి సంక్షేమంతో పాటు ఎలాంటి ఉగ్రదాడులు జరగకుండా పటిష్టమైన రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. దేశంలో 40వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిలరు మెంబరు రామచంద్రారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునీల్‌కుమార్, నామా చరణ్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, యుగంధర్, పవన్‌కుమార్, రాజుల శివ, వెంటక సుబ్బయ్య, పాలకొండ్రాయుడు, రామ్మోహన్, మాధవ, తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘీక వ్యక్తులను ప్రోత్సహించకండి



ప్రొద్దుటూరు, జూన్ 10, ప్రభాతవార్త: ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ప్రజా మద్దతుతో అఖండ మెజారిటి సాధించిన శాసనసభ్యులుగా ఎన్నికైన నంద్యాల వరదరాజుల రెడ్డి నియోజకవర్గంలోని అసాంఘీక కార్యకలాపాలు చేసే వ్యక్తులను ప్రోత్సహించ వద్దని అలాంటి వారిపై చర్యలు తీసుకునేలా పోలీస్ శాఖను ఆదేశించాలని కాంగ్రేస్ పార్టీ ఇంచార్జ్ పీఎండీ నజీర్ అహ్మద్ సూచించారు. సోమవారం స్థానిక కాంగ్రేస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజుల రెడ్డిపై ఎంతో నమ్మకంతో ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించారని గుర్తు చేశారు. ఈ సంధర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కానీ ప్రభుత్వం అధికారం చేపట్టకమునుపే ప్రొద్దుటూరులో అసాంఘీక శక్తులు నంద్యాల వరదరాజుల రెడ్డితో చేరుతున్నాయని పట్టణంలో పలు చోట్ల ప్రచారం జరుగుతోందని తెలిపారు. ఇదే నిజమైతే అలాంటి వారిని గతంలో నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రోత్సహించలేదన్నారు. అందుకే పెద్దాయనపై ప్రజలతో పాటు పలు పార్టీల నాయకులకు కూడ నమ్మకం ఉందని తెలిపారు.ఎటువంటి పరిస్థితులలోనూ క్రికెట్, మట్కా, గ్యాంబ్లింగ్ లాంటి అసాంఘీక కార్యకలాపాలతో సంబంధాలు ఉన్న వ్యక్తులను దరి చేర్చుకోవద్దని ఆయన సూచించారు. ఆరుసార్లు ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా గెలుపొందిన నంద్యాల వరదరాజుల రెడ్డికి మంత్రి పదవిని కట్టబెట్టాలని చంద్రబాబును కోరారు. ప్రొద్దుటూరు నియోజకవర్గం అభివృద్ధిలో కాంగ్రేస్ పార్టీ సహకరిస్తుందని తెలిపారు. సమావేశంలో కాంగ్రేస్ పట్టణ అధ్యక్షులు జీలాని బాషా పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి వర్గంలోకి అత్వాలే

కడప వైద్యవిభాగం, జూన్ 10, ప్రభాతవార్త: కేంద్రంలో మూడో సారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు, సోషల్ జస్టీస్ ఎంపవర్‌మెంట్ శాఖ కేంద్ర మంత్రిగా పని చేసిన రాందాస్ అత్వాలేకు మళ్లీ మూడో సారి కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కడంతో ఆ పార్టీ సౌత్ ఇండియన్ జనరల్ సెక్రటరీ నాగదాసరి అజయ్ ప్రసన్న, ఊసీ నాః లీగల్ సెల్ ఛైర్మన్ రమేష్‌బాబులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఆర్‌బీఐ జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ డా.వెంకటస్వామి ఆదేశాల మేరకు నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో వెంకటస్వామి పర్యవేక్షణలో ఏపీలో తమ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఎన్‌డీఏ కూటమికి భేషరతుగా మద్దతు ఇవ్వడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంబేద్కర్ ఆలోచనా పరుల ఓట్లు ఎన్‌డీఏకి గంప గుత్తగా పడ్డాయని దీంతో కూటమి అభ్యర్థులు విజయం సాధించారని చెప్పారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రవికుమార్, ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ గంగనపల్లె నరసింహ. కడప నగర అధ్యక్షుడు నాగదాసరి గాంధీ పాల్గొన్నారు.



## ఎల్లమ్మ తల్లికి 501 టెంకాయలు

కమలాపురం, జూన్ 10, ప్రభాతవార్త: కమలాపురం ఎమ్మెల్యేగా పుత్తా కృష్ణచైతన్యరెడ్డి గెలుపు కాంక్షించి పెద్దచెప్పలి ఎల్లమ్మ తల్లికి 501 టెంకాయలు కొడతామని మొక్కుకున్న పెద్దచెప్పలి టీడీపీ నాయకులు హనీఫ్‌ఖాన్, సుధ, శ్రీను, రాఫి, రమేష్, రాఫి, చిరంజీవి తమ మొక్కును సోమవారం చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## గర్భిణీలకు వైద్య పరీక్షలు

దువ్వూరు, జూన్ 10, ప్రభాతవార్త: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమం కింద 73మంది గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ సురేష్ బాబు, హేమలతలు పేర్కొన్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ గర్భవతులు ప్రతి రోజు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా మందులను వాడాలన్నారు. అలాగే రక్త పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. గర్భవతులందరికి రక్త పరీక్షలు నిర్వహించి రక్తశాతం తక్కువగా ఉన్న వారికి అందుకు అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతకుంట ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ వికసిత, షేక్ రోహిణి, అలాగే మేరి, సువర్ణ, శాంతకుమారి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే పుట్టాను కలిసిన నాయకులు



దువ్వూరు, జూన్ 10, ప్రభాతవార్త: మండల పరిధిలోని పెద్ద జొన్నవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి వారి అనుచరులు సోమవారం ప్రొద్దుటూరులో ఉన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి సన్మానించారు. ఈ సంధబ్బంగా పెద్ద జొన్నవరం గ్రామస్థులు సుమారు 20మంది ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలుపుతూ రాబోయే కాలంలో పెద్ద జొన్నవరం గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. నా మీద నమ్మకం ఉంచి ఎక్కువ మెజార్టీ తెచ్చినందుకు శాయశక్తులా గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని వారికి మాటీ ఇచ్చారు. గ్రామంలో మంచి మెజార్టీ తీసుకువచ్చారని అందుకు కారణమైన నాయకులను అభినందించారు.

## 13న మండల సర్వసభ్య సమావేశం

– ఎంపీడీవో రంగారావు

చిట్వేలి, జూన్ 10, ప్రభాతవార్త: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ 13న గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో సభా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు మండల ఎంపీడీవో రంగారావు తెలిపారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ సభ్యులు, సర్పంచులు తప్పక హాజరుకావాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల పూర్తి సమాచారంతో రావాలని ఎంపీడీవో రంగారావు కోరారు.

# గాయపడిన టిడిపి నాయకుడిని పరామర్శించిన చినబాబు



మదనపల్లెక్రైం, జూన్ 10 ప్రభాతవార్త :
వైసిపి కార్యకర్తల దాడిలో గాయపడిన టిడిపి నాయకుడిని తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామచినబాబు సొమవారం పరామర్శించారు. మొలకలచెరువు మండలం బురకాయలకోట పంచాయతీ పెద్దరాజులపల్లికి చెందిన వెంకటేశ్వరరాజును ఆదే గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ఖాజావల్లి, మరో పదిమంది ఘర్షణ పడి గాయపరిచారు. ఈ దాడిలో గాయపడన అతను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించిచికిత్సలు చేయిస్తున్నారు. దాడి విషయం తెలుసుకున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామచినబాబు, టిడిపి సీనియర్ నాయకులు మార్పురీ సుధాకర్‌నాయుడు, టిడిపి రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు, తదితరులు అస్పత్రికి చేరుకుని వెంకటేశ్వరరాజును పరామర్శించారు. వెంకటేశ్వరరాజుకు మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ సూపరింటెండెంట్‌కు సూచించారు. అనంతరం శ్రీరామ చినబాబు విలేకర్లతో మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గంలో వైసిపి నాయకుల అగడాలు ఎక్కువైయ్యాయన్నారు. త్వరలోనే వారికి తగిన శాస్త్రీ చేస్తామని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వారందరిని జైలుకు పంపటం ఖాయమన్నారు.

## ఫిట్టర్ రంగచారిని సస్పెండ్ చేయాలి



కమీషనర్‌కు విన్నవిస్తున్న పునీత్

మదనపల్లె జూన్ 10 ప్రభాతవార్త :
మదనపల్లె మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఫిట్టర్ రంగచారిని సస్పెండ్ చేయాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రంగచారి ప్రభుత్వం నుంచి వేతనం తీసుకుంటున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను మున్సిపల్ పనులు కాకుండా తన సొంత వ్యవసాయం పొలంలో పనులు చేయించుకుంటున్నారని వివర్శించారు. ఆదే సమయంలో వర్కర్ల పట్ల అసభ్యంగా దూషిస్తున్నారన్నారు. సొంతపనులకు వస్తేనే వారికఇ అటెండెన్స్ వేయటం జరుగుతోందన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రంగచారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అనంతరం కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నవీన్, శశికుమార్, బాలకృష్ణ, పూర్ణచంద్ర, వినయ్, జగదీష్, సాయి, ముని తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ ఎరువుల విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు చేపట్టాలి



బద్వేలు అర్బన్ , జూన్ 10 (ప్రభాతవార్త) :
కల్తీ ఎరువులను విక్రయిస్తున్న దుకాణ యాజమాన్యాలపై దృష్టిసారించి చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం అగ్రికల్చర్ ఏడీఏ నాగరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చిన్ని మాట్లాడుతూ పలు ఎరువుల దుకాణాలలో కల్తీ ఎరువులు మరియు విత్తనాలు విక్రయించడంతో వాటిని కొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఇలాంటి షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వం గత రెండేళ్ల క్రితం నిర్వహించిన భూ సార పరీక్ష ఫలితాలు నేటికి రైతలకు వివరించలేదని వాటిని తెలిపి రైతులకు తగు సాయం చేయాలని, అలాగే జింక్ లోపాన్ని నివారించే జిప్సంను ప్రభుత్వం అందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, నాగార్జున, రూరల్ కార్యదర్శి బాల గురవయ్య, ఉపాధ్యక్షులు యువరాజ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘ ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా

పీలేరు, జూన్ 10 ప్రభాతవార్తః
నియోజకవర్గ పరిధిలో గల కలికిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్‌పర్సన్ పదవికి నల్లారి శ్రీకర్‌రెడ్డి రాజీనామ చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడుతున్న నేపథ్యంలో తన పదవికి రాజీనామా లేఖను ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎం.కొండప్పకు సమర్పించినట్లు ఆయన తెలిపారు. తనతో పాటు కమిటీ సభ్యులు ఎన్.నారాయణ కె.రసూల్‌సాహెబ్ రాజీనామా చేశారని తనపై నమ్మకంతో ఛైర్‌పర్సన్ పదవిని తనకు అవకాశం కల్పించిన మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఇతర నాయకులకు అతని విధి నిర్వహణలో సహకరించిన కమిటీ సభ్యులకు అధికారులకు, మిత్రులకు శ్రేయోభిలాషులకు పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 2024 సార్వత్రిక ఎన్నికలలో ప్రజల తీర్పు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రావడంతో ప్రజాతీర్పును శిరసా వహించి నైతిక బాధ్యత వహిస్తూ తాను ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తాను ఎల్లప్పుడు పదవులు ఉన్నా లేకున్నా ప్రజలకు తోడుగా ఉంటానని తెలిపారు.



# ఆరోగ్య పరీక్షలతోనే తల్లిబిడ్డ సంక్షేమం

పీలేరు, జూన్ 10 ప్రభాతవార్తః
గర్భిణీలు పుట్టబోయే పండంటి బిడ్డకోసం ఆరోగ్యపరీక్షలు తప్పనిసరి అని అందుకు ప్రతినెల 9వ తేదీ తలపుల పీహెచ్‌సీ లో జరిగే పీఎంఎస్‌ఏ కార్యక్రమం గర్భిణీకి చక్కటి అవకాశమని అది పుట్టబోయే శిశువుకి మహాభాగ్యమని ప్రధాన వైద్యాధికారి రమేష్‌రెడ్డి గర్భిణీ స్త్రీలకు హితవు పలికారు. సోమవారం పీహెచ్‌సీలో గర్భిణీలకు వ్యాదుల నిర్ధారణకు అవసరమగు రక్త,మూత్ర పరీక్షలు మధుమేహం, అధిక రక్తపోటు తదితర పరీక్షలు నిర్వహించి ఐరన్, పోలిక్ యాసిడ్, కాల్షియమ్, ఆల్బెండజోల్ 400 మంజీ మందులు తో పాటు సలహాలు, సూచనలు అందజేశారు. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా గర్భిణీల వ్యాధుల నిపుణులతో నాలుగు గర్భిణీ పరీక్షలు, రెండు టీడీ సూదిమందులు 180 ఏఎఫ్ఏ మందులు నెలనెలా వైద్యులు సూచించిన పరీక్షలు, ఆసుపత్రిలో కాన్పు, ప్రతి గర్భినీ పాటించాలని డాక్టర్ తెలియజేశారు. ఈకార్యక్రమంలో కొండయ్య, కష్ణయ్య, కుసుమ, నాగవేణి, సీహెచ్ఓ ఆశ కార్యకర్తలు, గర్భిణీస్త్రీలు పాల్గొన్నారు.

## సబ్సిడీ వేరుశనగ విత్తనాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి, జూన్ 10, ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, ఎంపీటీసీ చిరంజీవమ్మలు పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వం సబ్సిడీతో మంజూరు చేసిన వేరుశనగ విత్తనాలను మర్రికుంటపల్లె పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో రైతులకు సర్పంచ్ రెడ్డిరామ్, ఎంపీటీసీ చిరంజీవమ్మలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుత తెదేపా ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నారా చంద్రబాబునాయుడు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. రాబోయే రోజుల్లో కూడా రైతులను రాజులను చేసే విధంగా తెదేపా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వాసనూరి చంద్రశేఖర్, తెదేపా సీనియర్ నాయకులు ఎం.ఆనందరెడ్డి, వాసనూరి చిన్నరెడ్డయ్య, యువ నాయకులు చెన్నబసవయ్య, మహేష్, కలికిరి మండలం తెలుగు యువత అధ్యక్షులు శ్రీనివాసులు, టీడీపీ యువ నాయకులు వాసనూరి రెడ్డయ్య, కొట్టాల చల్లయ్య, ఎస్.వీరభద్రయ్య,



సీనియర్ నాయకులు వెంకటపతి, మర్రికుంటపల్లె పంచాయతీ టీడీపీ అధ్యక్షులు వెంకటపతి, మైనార్టీ టీడీపీ యువ నాయకులు రెడ్డిబాషా, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాముడి గెలుపు రాయచోటికి మలుపు

రాయచోటి, జూన్ 10, ప్రభాతవార్త:
స్థానిక ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెదేపా ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్ మాట్లాడుతూ రాయచోటిలో రాముడి గెలుపు రాయచోటికి మలుపు అని రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్ అన్నారు. రాయచోటిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ తెదేపా, బీజేపీ, జనసేన కూటమి గెలుపునకు కృషి చేసిన అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం గిరిజన ప్రజానీకానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెదేపా పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి అమాస రెడ్డయ్య మాట్లాడుతూ రాష్ట్ర కూటమి అన్నమయ్య జిల్లా పరిధిలో ఉన్న గిరిజన ప్రజానీకానికి, పార్టీకి అహర్నిశలు కష్టపడిన పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పార్లమెంటు పరిధిలో గెలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులకు అదే విదంగా రాయచోటి స్థానిక ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. తన గెలుపునకు సహకరించిన గిరిజనులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి పథకాలు అందేలా చూస్తానన్నారు. టీడీపీ ఎస్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బి.నాయక్ మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో గిరిజన సోదరులు వైసీపీ ప్రభుత్వం జరిపిన అరాచకాలకు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ రాజంపేట నియోజకవర్గం రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకులు కిశోర్ నాయక్, జయరాం నాయక్, నిత్యపూజయ్య, రాము, సునీల్, బద్దు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమిత స్థలాన్ని ఖాళీ చేయాలి



చిన్నమండెం, జూన్ 10, ప్రభాత వార్త :
మండల పరిధిలోని మదనపల్లె రాయచోటి ప్రధాన రహదారిలో దేవగుడిపల్లె గ్రామం కస్తూరిభా గురుకుల పాఠశాల సమీపంలో ఆక్రమణకు గురైన ఆర్అండ్ బి ఖాళీ స్థలాన్ని సోమవారం ఆర్అండ్ బి ఏఈ రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఆ స్థలంలో ఇటుకల పరిశ్రమ నడుపుతూ అందులో నిర్మాణాలు కూడా చేపట్టిన ఆక్రమణ దారుని అక్కడికి పిలిపించి మాట్లాడారు. ఈ నెల చివరి లోపల స్థలం ఖాళీ చేసి నిర్మాణాలను తొలగించాలని తెలిపారు. అలా చేయని సందర్భాల్లో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## దేవగుడిపల్లెలో తాగునీటి కష్టాలు

- బోరు మోటారు చెడిపోయినా పట్టించుకోని అధికారులు



చిన్నమండెం, జూన్ 10, ప్రభాత వార్త :
మండలంలోని దేవగుడిపల్లె గ్రామ కస్పాలో ఉన్న తాగునీటి బోరు చెడిపోయి పది రోజులు అయింది. పలుమార్లు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. వివరాలలోకి వెళ్లితే దేవగుడిపల్లె కస్పాలో దాదాపు 100 కుటుంబాలు నివాసం వున్నారు. కస్పాలో తాగునీటి కోసం ఉన్న బోరు పది రోజుల నుండి పని చేయకుండా పోయింది. దీంతో గ్రామస్తులు సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి బిందెలతో నీళ్ల తెచ్చుకునే పరిస్థితి వచ్చింది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే బోర్లకు మరమ్మతులు చేసి నీటి కష్టాలను తొలగించాలని అధికారులను కోరారు.

**పంచాయతీ కార్యదర్శి వివరణ**

ఈ విషయంపై పిఆర్ కార్యదర్శి సుమిత్రమ్మ వివరణ కోరగా.... బోరు మోటారు చెడిపోయిన విషయం ఈరోజే నాకు తెలిసింది. మరమ్మతులు చేస్తామని తెలిపారు. అయితే పది రోజుల క్రితం చెడిపోతే ఈరోజే నాకు తెలిసింది అనడంతో గ్రామ సమస్యలపై ఆమె స్పందించే విధానం తేటతెల్లమవుతుందని గ్రామస్తులు అన్నార. ఇకనైనా నిర్లక్ష్యం వీడి గ్రామంలో నీటి సమస్యలను తీర్చాలని పలువురు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిన్నమండెం, జూన్ 10, ప్రభాత వార్త :



మండలంలోని వండాడి గ్రామం తూర్పుపల్లె హరిజనవాడకు వెంకటరమణ (30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ వివరాలు మేరకు వెంకటరమణ రాయచోటిలో నంది బోర్‌వెల్స్ లో మేనేజర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. సోమవారం తన ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా తూర్పుపల్లె హరిజవాడ వద్ద మదనపల్లె నుండి వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణకు గాయాలైయ్యాయి. వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు తీసుకెళ్లమని సలహా ఇవ్వడంతో తిరుపతికి త రలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. వెంకటరమణ భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వెంకటరమణకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వెంకటరమణ మృతితో కుటుంబం అనాథలైయ్యారని గ్రామస్తులు కన్నీరు మున్నీరవుతున్నారు.

## అనంతరాజపురంను సందర్శించిన నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంటు టీం

బద్వేలు, జూన్ 10 ప్రభాతవార్త :
బద్వేలు మండలం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అనంతరాజపురంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంటు టీం సోమవారం సందర్శించింది. ఇందులో భాగంగా మాతా, శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలపై హెల్త్ క్లినిక్ నందు మెయింటెనెన్స్, మందులు మరియు ఇతర సేవలపై జాతీయ క్వాలిటీ అసెస్‌మెం టీము డాక్టర్ మితిలీష్ చంద్రసూరి, డాక్టర్ రాఘువేంద్రరావులు పర్యవేక్షించి అక్కడి వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మాతా, శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జే.వినయ్‌కుమార్, క్వాలిటీ కంట్రోల్ రమేష్,హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ ప్రభావతి, శుభలేఖ, రాధ, సుష్మిత, వీణా, భవాణి, శిరీష తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## మదనపల్లెలో ఎగ్జిబిషన్ ప్రారంభం



మదనపల్లెక్రైం, జూన్ 10 ప్రభాతవార్త :
మదనపల్లెలో ఏర్పాటుచేసిన ఫారిన్ సిటి ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ పట్టణ ప్రజలకు కనువిందు చేసేలా ఎగ్జిబిషన్ ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 40 రోజుల పాటు నిర్వహించే ఎగ్జిబిషన్ ద్వారా ప్రజలకు వినోదం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యేని ఎగ్జిబిషన్ నిర్వాహకులు శంకర, మూర్తిలు ఘనస్వాగతం పలికారు.

## కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్



మదనపల్లెక్రైం, జూన్ 10 ప్రభాతవార్త :
కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఈబి సిఐ రమేష్‌రెడ్డి తెలిపారు. సిఐ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. కురబలకోట మండలం అబ్బినాయినిపల్లికి చెందిన క్రిష్ణప్ప భార్య మల్లేశ్వరి (35) కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావటంతో మదనపల్లె ఎస్ఈబి అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆమె వద్ద 9 బీరు బాటిళ్లు వున్నట్లు గుర్తించారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

## ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వైస్‌ఛైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి మృతి



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు, జూన్ 10 ప్రభాతవార్తః
పట్టణంలోని చిత్తూరు మార్గంలోని ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాల వైస్‌ఛైర్మన్ ఎం. అరుణ్‌కుమార్‌రెడ్డి మతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నాగిరెడ్డి కాలనీలోని వారి స్వగహం నందు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైసీపీ నాయకులు దండు జగన్‌మోమన్‌రెడ్డి, డాక్టర్ హబీబ్‌బాషా, రైల్వేచలపతి, నారే వెంకటరమణారెడ్డి తదితరులు ఉన్నారు.

## బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలవాలి

కడప వైద్యవిభాగం, జూన్ 10, ప్రభాతవార్త:
రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అండగా నిలబడాలని ఏపీ మాల మహానాడు వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయ శేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం వైఎస్ఆర్ కడప మాల మహానాడు నగర అధ్యక్షులు చెంచుల డేవిడ్ సత్యరాజు ఆధ్వర్యంలో ఎర్రగుంట్లలో విజయశేఖర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. డేవిడ్ సత్యరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బడుగు, అణగారిన వర్గాల పక్షాన పోరాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వవిజయశేఖర్ మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాల మహానాడు నాయకులు కానాల క్లెమెంట్ రాజు, చెంచుల ఎబినేజర్, వర్రా శ్యామ్, తేజ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్ బాబును కలిసిన సుగవాసి



రాయచోటి, జూన్ 10, ప్రభాతవార్త:
విజయవాడలో సోమవారం తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి మంగళగిరి ఎమ్మెల్యే కాబోయే మంత్రివర్యులు నారా లోకేష్ బాబును రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గ తెదేపా నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు మార్యపూర్వకంగా కలిసి కూటమి విజయంలో కీలక పాత్ర పోషించిన లోకేష్‌ను ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి శుభాభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం దారుణం

- మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి, జూన్ 10, ప్రభాతవార్త:
ప్రజల ఆస్తులుగా చెప్పుకునే ప్రభుత్వ కార్యాలయాలను ధ్వంసం చేయడం దారుణమని రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీకి చెందిన కొంత మంది మూకలు సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌ల బోర్డులను, శిలాఫలకాలను పగలగొడుతూ విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. రామాపురం మండలం చిట్లూరు, రాయచోటి రూరల్ మండలంలోని సిబ్యాల గ్రామాల సచివాలయాలలో గతంలో ఎన్నడూ లేని విధంగా అరాచకాలు చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తి కాబట్టి జిల్లా కలెక్టరు, జిల్లా అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

## నల్లారి తనూజారెడ్డిని కలిసిన ఐకేపీ ఉద్యోగులు, సంఘమిత్రలు




కలికిరి, జూన్ 10, ప్రభాతవార్త:
పీలేరు నియోజకవర్గం నూతన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డిని అదే విదంగా కిశోర్‌కుమార్‌రెడ్డి తనయురాలు వైష్ణవిరెడ్డి, కోడలు సమారెడ్డిలను ఐకేపీ ఉద్యోగులు, సంఘ మిత్రలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలికిరి మండలం మాజీ జడ్పీటీసీ మాలతీ ఆధ్వర్యంలో ఐకేపీ ఉద్యోగులు, సంఘ మిత్రలు నల్లారి తనూజారెడ్డిని కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఉద్యోగులు నల్లారి తనూజారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దేవసేన, వెలుగు సీసీలు మల్లికార్జున, ఆంజనేయులు, ప్రభాకర్, సంఘ మిత్రలు రమాదేవి, రాణెమ్మ, రెడ్డిరాణి, జయంతి, మాజీ మండల సమాఖ్య అధ్యక్షురాలు రెడ్డమ్మ, పలువురు పాల్గొన్నారు.

## పొలతల క్షేత్రంలో పుత్తా విజయంపై పూజలు

పెండ్లిమర్రి, జూన్ 10, ప్రభాతవార్త:
సార్వత్రిక ఎన్నికల్లో పుత్తా కృష్ణచైతన్యరెడ్డి ఘన విజయం సాధించడంతో పొలతల క్షేత్రంలో మాజీ సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్లేశ్వర స్వామికి 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే మల్లేశ్వర స్వామికి పూజలు చేశారు. అలాగే అక్కదేవతలు, బండెన్న, పుట్టాంజనేయ స్వాములకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి తమ నాయకుడు గెలిచినందుకు సంతోషం వ్యక్తం చేశారు. బాణా సంచా పేల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మేని ఛాయ కోసం పంచదార!



ఆరోగ్యంగా ఉండాలంటే తీపికి.. అందులోనూ ప్రత్యేకించి పంచదారకు దూరంగా ఉండాలన్నది తెలిసిందే. కానీ ఆరోగ్యానికి చెరుపు చేసే పంచదార సౌందర్య పరిరక్షణలో మాత్రం కీలక పాత్ర పోషిస్తుందంటున్నారు నిపుణులు.

మరి అది ఎలాగో చూద్దాం రండి..

**లేలేత అధరాలకు....**
సాధారణంగానే పెదవుల మీద కొద్దిగా చక్కెర రాస్తే మృతకణాలు తొలగిపోయి మృదువుగా మారతాయి. కొద్దిగా చక్కెర తీసుకుని అందులో పాలు, తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో రోజూ రాత్రి పూట పడుకొనే ముందు పెదువులకు మెల్లగా మర్దన చేసుకుంటే గులాబీల్లాంటి లేలేత అధరాలు సొంతమవుతాయి. అయితే ఈ చిట్కా ఎప్పుడో ఓసారి కాకుండా రెండు లేదా మూడు రోజులకోసారి పాటిస్తేనే సత్ఫలితాలు పొందవచ్చు.



**ఎసెన్షియల్ ఆయిల్‌తో..**
చర్మం పొడిబారి నిర్జీవంగా మారినప్పుడు చక్కెరని ఉపయోగించి తిరిగి దాన్ని సాధారణ స్థితికి తీసుకురావచ్చు. దీనికోసం కొద్దిగా చక్కెర తీసుకుని అందులో మీకు నచ్చిన ఎసెన్షియల్ ఆయిల్ కొన్ని చుక్కలు వేసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని కాసేపు మృదువుగా మర్దన చేసుకోవాలి. తర్వాత చల్లని నీటితో ముఖం శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మళ్లీ కొత్త కళను సంతరించుకుంటుంది.

వృద్ధాప్య ఛాయలు రానీయకుండా... చర్మం ముడతలు పడటం, సన్నని గీతలు కనిపించడం. వంటి లక్షణాలు ద్వారానే వయసు పైబుతోందన్న విషయం పైకి తెలుస్తుంది. చక్కెరని ఉపయోగించడం వల్ల



చర్మం ముడతలు పడకుండా కాపాడుకోవచ్చు. అలాగే చక్కెర సన్నని గీతలు కూడా కనిపించకుండా చేస్తుంది.

దీనికోసం కొద్దిగా చక్కెర తీసుకుని అందులో నిమ్మరసం వేసి ముఖానికి రాసుకోవాలి. ఆరిన తర్వాత తడి గుడ్డతో తుడుచుకోవాలి. ఇది సూర్యరశ్మిలో ఎక్కువ సమయం ఉండటం వల్ల ఎదురయ్యే ట్యానింగ్, పిగ్మెంటేషన్ వంటి సమస్యలకు కూడా చక్కని పరిష్కారంగా ఉపయోగపడుతుంది.

**మేని ఛాయ కోసం...**
చర్మం రంగుని పెంచుకోవాలనుకునేవారు కొద్దిగా గంధం తీసుకుని అందులో రోజ్‌వాటర్, చక్కెర చెంచా చొప్పున వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా అప్లై చేసుకోవాలి. 15 నుంచి 20 నిమిషాలు ఆరనిచ్చి తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ◻

# తనలా బాల్యంలేని వాళ్లకు అండగా..




**'శూర్పణఖలా ముక్కూచెవులూ కోసి పంపిస్తాం.. వివస్త్రను చేసి ఊరంతా ఊరేగిస్తాం.. ముక్కలు ముక్కలుగా నరికి నీ ఆనవాళ్లే కనిపించకుండా చేస్తా'.. ఇలాంటి బెదిరింపులే కాదు, ఎన్నో దాడులకూ గురయ్యారు డాక్టర్ కృతి భారతి. కానీ ఆవేమీ ఆమె యజ్ఞాన్ని ఆపలేకపోయాయి. కాబట్టే వేలమంది చిన్నారులు బాల్యవివాహాల నుంచీ, మరెంతో మంది నరకప్రాయమైన జీవితం నుంచీ బయటపడ్డారు.**

అర్ధరాత్రి.. తలుపునెవరో దబదబా బాదుతున్నారు. ఎవరని అడిగితే సమాధానం లేదు. రెట్టించి అడిగితే ఎక్కిళ్లతో కూడిన ఏడుపు. కంగారుపడిన కృతి తలుపు తీస్తే.. పదహారేళ్లమాయి. లోపలికి తీసుకెళ్లి, ఆమె దుఃఖం ఆగేవరకూ అలాగే పొదివి పట్టుకున్నారామె. తేరుకున్నాక నెమ్మదిగా తన గురించి చెప్పిందా అమ్మాయి. ఏడాది వయసులో పెళ్లైందామెకు. పదహారేళ్లు వచ్చాయని తల్లిదండ్రులు ఆమెను అత్తారింటికి పంపాలనుకున్నారు. కట్టుకున్న వాడికి 69 ఏళ్లు. నేను వెళ్లను, చదువుకుంటానంటే బెదిరించి మరీ పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. కృతి గురించి తెలుసుకున్న ఆ చిన్నారి అర్ధరాత్రి ఇంటి నుంచి పారిపోయింది. చిమ్మ చీకటిలో ఎడారిలో కాలినడకన ప్రయాణించి కృతిని చేరుకుంది. ఆమె కథనంతా విన్న కృతి చలించిపోయారు. ఆమె తరఫున పోరాడి, ఆ వివాహం రద్దయ్యేలా చేశారు. ఆపై చదువు చెప్పించి, జీవితంలో స్థిరపడే వరకూ తోడు నిలిచారు. ఇలా ఒక్కరూ ఇద్దరూ కాదు. ఎంతోమంది బాల్యవివాహాలు రద్దవ్వడానికి కారణమయ్యారీమె ఇంత చేస్తున్న కృతిదీ విషాదగాథే !

**పక్షవాతానికి గురై....** కృతిది రాజస్థాన్ బోధ్‌పూర్. కడుపులో పడగానే వాళ్లమ్మను నాన్న వదిలేశారు. అబార్షన్ చేయించుకొని మరో పెళ్లి చేసుకోమని ఎంతోమంది సలహా లిచ్చినా తల్లి వినలేదు. దీనికితోడు అనారోగ్యం తలెత్తి కృతికి ఏడో నెలలోనే జన్మనిచ్చారు. పుట్టకముందే తండ్రి దూరమ య్యాడు. తల్లి అనారోగ్యానికీ కారణమైందని ఆమెను అంతా నష్టజాతకురాలని పిలిచేవారు. కనిపిస్తే చీదరించుకునేవారు. ఆకారణంగా కొట్టేవారు. చాలదన్నట్టు నాలుగో తరగతిలో ఉండగా కృతికి పక్షవాతం వచ్చింది. వైద్యులు ఎవరో విషమిచ్చారన్నారు. అంతా బతకదన్నా వాళ్లమ్మ మాత్రం చిన్నారి కృతికి చేయించని వైద్యం లేదు. అలా బతికి బయటపడ్డారు కృతి. తనలా అందమైనబాల్యం లేనివాళ్లకు అండగా నిలవాలని చిన్నప్పుడే నిర్ణయించుకున్నారు. చదువుపై దృష్టిపెట్టి, సైకాలజీలో పిజి, పిహెచ్‌డి చేశారు. ఎన్‌జిఓలతో కలిసి కౌన్సెలింగ్ కూడా చేసేవారు. తొలికేసు రేప్‌కి గురైన 9 ఏళ్లమ్మాయిది. ఆ ట్రామా నుంచి బయటపడేస్తే సరిపోదు, న్యాయం అందించాలనుకున్నారామె. బెదిరింపులకు తలొగ్గకుండా నిలిచారు కూడా. తరవాత 2011లో 'సారథి ట్రస్ట్' ప్రారంభించి బాలకార్మికులు, రేప్‌కి గురైనవారు ఇలా ఎందరి తరపునో పోరాడుతున్నప్పుడు ఆ చిన్నారి పెళ్లికూతురు ఈమె తలుపు తట్టింది.

**అవగాహన కలిగిస్తూ..** పెళ్లిళ్ల రద్దు చేయడం కాదు.. వాటిని జరగకుండా ఆపాలనుకున్నారామె. వలంటీర్లను ఏర్పాటు చేసుకొని వీటిపై పోరాడటం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ముక్కు, చెవులు కోసేస్తాం, చంపేస్తాం, గ్యాంగ్ రేప్ చేస్తామంటూ బెలోడు బెదిరింపులు, కొన్నిసార్లు దాడులూ జరిగాయి. అయినా ఒక చిన్నారి జీవితం కంటే అవేమీ పెద్దవి కాదు అంటారామె. అయితే పెళ్లి ఆపడంతోనే సమస్య తీరదు అని గ్రహించారు కృతి. ఆ అమ్మాయిని నష్టజాతకురాలు. పెళ్లి ఆగిపోయిందని హింసించేవారు. వెలేసేవారు కూడా. ఆ అమ్మాయిలకు కౌన్సెలింగ్ చేసి, చదువు, ఒకేషనల్ ట్రెనింగ్ వంటివి ఇస్తున్నాం. వాళ్ల కాళ్లమీద వాళ్ల నిలబడేలా చేస్తున్నాం. మేమెల్లి ఆపడం కాదు, తల్లిదండ్రులకే ఆ స్పృహ రావాలని అవగాహన కార్యక్రమాలతో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నాం. ఓ హెల్ప్‌లైన్‌నీ ఏర్పాటు చేసుకున్నాం. ఈ క్రమంలో చావు అంచుల వరకూ వెళ్లినా కొనసాగుతున్నా అంటారు 37 ఏళ్ల కృతి. వీధిబాలలు, దివ్యాంగులు, హెచ్ఐవి బాధిత చిన్నారులు, వ్యసనాలకు అలవాటుపడ్డ వారిని చేరదీసి, చదువు చెప్పించడం, మహిళలకు స్వయం ఉపాధి కార్యక్రమాలు వంటివెన్నో చేస్తున్నారు. తన సంపాదన దీనికే కేటాయిస్తున్నారామె. 2020లో సిబిఎస్ఈ ఈవిడ కథను పాఠంగా చేర్చింది. జెనీవా సెంటర్ ఫర్ హ్యూమన్ రైట్స్ నుంచి గ్లోబల్ యూత్ హ్యూమన్ రైట్స్ ఛాంపియన్ సహా మరెన్నో పురస్కారాలు అందుకున్నారు. జాతీ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో కృతి స్పీకర్ కూడా. ◻




**చెలి చిట్కా**
డైనింగ్ టేబుల్ మధ్యలో పుదీనా ఆకును ఉంచితే ఆ వాసనకు ఈగలు, దోమలు దగ్గరకు రావు. ◻

# వెండి వస్తువులు కొత్తగా..

**వర్షాకాలంలో వెండి వస్తువులు నల్లగా మారే అవకాశాలు ఎక్కువ. ఇందుకు కారణం గాలిలో తేమ శాతం తక్కువగా ఉండటమే.**

ఇలా గాల్లోని తేమతో జరిగే రసాయనిక చర్య వల్ల వెండి నల్లగా మారిపోతుంది. ఫలితంగా అది మెరుపుని కోల్పో తుంది అందుకే వెండి వస్తువులను వీలైనంత వరకు గాలి తేమ తగలని ప్రదేశంలో భద్రపరచాలంటారు. అయితే ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఒక్కోసారి ఇవి నల్లగా మారి మెరుపు కోల్పోతుంటాయి. ఇలాంటప్పుడు కొన్ని ఇంటి చిట్కాలతో తిరిగి వాటిని మెరిపించ వచ్చుంటు న్నారు నిపుణులు.

**వేడి నీళ్లతో...** వెండి నగలు, వస్తువులపై బాగా మురికి పేరుకు పోయినప్పుడు వేడి నీళ్లతో దాన్ని సులభంగా శుభ్రం చేయచ్చు. ఇందుకోసం రెండు కప్పుల వేడి నీళ్లలో కొద్దిగా డిటర్జెంట్ పౌడర్‌ని కలపాలి. ఆ తర్వాత శుభ్రం చేయాలనుకుంటున్న వెండి వస్తువుల్ని అందులో కొద్దిగా కాసేపు ఉంచాలి. అనంతరం బయటకు తీసి, మెత్తని బ్రష్‌తో సన్నితంగా రుద్దాలి. ఆ తర్వాత పొడిగా ఉన్న మెత్తని వస్త్రంతో తుడిచేస్తే ఫలితం ఉంటుంది.



**ఉప్పు నీళ్లతో..** కాస్త నల్లగా మారిన వెండి వస్తువుల్ని ఉప్పు నీళ్లతో సులభంగా శుభ్రం చేసుకోచ్చు. కొన్ని నీళ్ల తీసుకని అందులో కొద్దగా ఉప్పు కలపాలి. దానిలో నల్లగా మారిన వెండి వస్తువుల్ని కాసేపు ఉంచాలి. ఆ తర్వాత మెత్తటి బ్రష్‌తో రుద్దిదతే నలుపు పూర్తిగా వదిలిపోయి పూర్వపు మెరుపును సంతరించుకుంటాయి.

**టూత్‌పేస్ట్‌తో...** టూత్‌పేస్ట్‌లో ఉండే క్యాల్షియం వెండి వస్తువులను ధగధగలాలా చేస్తుంది. ఈ క్రమంలో కొద్దిగా పేస్ట్‌ని తీసుకుని దాన్ని వెండి వస్తువుకు పల్చని పొరలా పూయలి. టూత్‌పేస్ట్ పూర్తిగా ఆరిపోయే దాకా ఆగాలి. ఆ తర్వాత టిష్యూ పేపర్‌తో తుడిచి నీటితో శుభ్రం చేసేయాలి. ఇలా చేస్తే వాటి మెరుపు తిరిగొస్తుంది. ఇంకా వెండి వస్తువుల నలుపు పూర్తిగా వదలకపోతే ఇది పద్ధతిని మరోసారి పాలో అయితే సరి. ◻

# వాముతో ఆరోగ్యం..

**ఒంట్లో కాస్త నలతగా అనిపిస్తే చాలు వెంటనే డాక్టరు. మెడికల్ షాప్ అంటూ పరుగులు పెడుతుంటాం. నిజానికి మన వంటిల్లే ఔషధాల గని అని మీకు తెలుసా! డబ్బాలో ఉండే వాము అనేక అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.** వామును తీసుకపోవడం వల్ల శరీరానికి కావల్సిన పోషకాలు అందడంతో పాటు బరువూ తగ్గుతారు.



◆ ఎండల్లో మాంసాహారం తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతకి బయట ఉష్ణోగ్రత తోడై డయేరియా, మలబద్ధకం, కడుపు నొప్పి వంటి సమస్యలకు దారితీస్తాయి. వీటి నుంచి ఉపశమనం పొందాలంటే. గ్లాసు నీటిలో చెంచా వామువేసి సగం అయ్యేవరకు మరిగించి గోరువెచ్చగా తాగితే అజీర్తి తగ్గుతుంది.

◆ నెలసరి సమయంలో వచ్చే నొప్పుల నుంచి ఉపశమనం పొందడానికి మూడు పూటలా వామునీటిని తాగితే ఫలితం ఉంటుంది.

◆ బరువు తగ్గడానికి గ్లాసు నీళ్లలో చెంచా వాము రాత్రంతా నానబెట్టి మరుసటి రోజు ఉదయం తేనె కలిపి పరగడుపున తాగితే సరి. ◻

# ప్రధాని ప్రమాణ స్వీకారానికి హాజరు..

**అవకాశం ఇస్తే చాలు..** మగువలు తమని తాము నిరూపించుకోవడమే కాదు చరిత్రనూ లిఖించగలుగుతారు. ఇందుకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కి లోకోపైలట్లుగా వ్యవహరిస్తున్న ఐశ్వర్య ఎస్. మీనన్, సురేఖాయాదవ్‌లే ఉదాహరణ. దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి బాధ్యతలు చేపట్ట నున్న వేళ ప్రమాణ స్వీకారమహోత్స వానికి వీరి ద్దరికీ ఆహ్వానం లభించింది. వీరిలో ఐశ్వర్య దక్షిణ చెన్నై డివిజన్ సీనియర్ అసిస్టెంట్ లోకో పైలట్. ఆమె ప్రస్తుతం వందే భారత్ రైలుని నడుపుతున్నారు. కచ్చితత్వం, చురుకుదనంతోపాటు రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థపై లోతైన పరిజ్ఞానంతో అధికారుల మన్ననలెన్నో అందుకున్నారు. వందేభారత్‌లో పాటు జనశతాబ్ది వంటి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను నడిపి రెండు లక్షలకు పైగా ఫుట్‌ప్లేట్ గంటలను పూర్తిచేసి రికార్డు సాధించారు. ఈమెతో పాటు ఆసియాలోనే తొలి మహిళా పైలట్‌గా గుర్తింపు పొందిన సురేఖాయాదవ్‌ది మహారాష్ట్రలోని సతారా. 1988లో భారతదేశపు తొలి మహిళా రైలు డ్రైవర్‌గా చరిత్ర సృష్టించిన ఆమె తన కెరియర్‌లో ఎన్నో అవార్డులూ, రివార్డులూ అందుకున్నారు. సెమీ హైస్పీడ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కి మొదటి మహిళా లోకో పైలట్ కూడా. ఈ ఘనతలే వీరిద్దరికీ ప్రత్యేక ఆహ్వానాన్ని అందించాయి. ◻






# పూజ పునస్కారాలు



చిన్న పిల్లలకు అంటే 5 ఏండ్ల నుంచి 10 ఏండ్ల లోపు వారికి స్నానం చేసి, దేవుని ముందు నిలబడి సరస్వతీ నమస్తుభ్యం అను శ్లోకాన్నీ 'తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్' అను పద్యాన్ని చెప్పు, నీకు బాగా విద్య వస్తుంది అని చెబుతాం. వారు ఇంకొంత పెద్దవారై పై తరగతులకు వెళితే త్వరగా ప్రార్థన ముగించి, పుస్తకాలు తీసుకొని హోం వర్క్ చేసి, చదువుకో అంటాం. వారు ఇంకా పై తరగతులకు పోతే దైవాన్ని స్మరించి వారు చదవాల్సిన దానికి, రాయాల్సిన దానికి సమయాన్ని వినియోగిస్తారు. విద్యను ఆర్జిస్తారు. అంతే గానీ ఇంకా శ్లోకాలు, పద్యాలు వల్లించుకొంటూ కూర్చుంటే ఆ శ్లోకాలు, పద్యాలు కంఠస్థం రావచ్చేమో గానీ విద్యరాదు అలాగే బాలనయంలో 'లక్ష్మీ! క్షీర సముద్ర రాజ తనయా' అని చెప్పుకొంటూ ఉంటే పర్వాలేదు, కానీ పెద్దవడైనా లక్ష్మీదేవిపై స్తోత్రాలు చేసుకొంటూ పూజాగదికి పరిమితమైతే బంగారు నాణేల వర్షకురవదు. వాడు శ్రమించి ఏదో ఒక పని చేయాలి. అలాగే ఆధానయత్మిక పథంలో ప్రారంభదశలోపూజలు, పునస్కారాలు, కీర్తనలు, సంధ్యావందనాలు ఉంటే తప్పులేదు. కానీ వయసు పెరుగుతున్న కొద్దీ ఆ పూజ పునస్కారాల, కీర్తనల-సంధానయవందనాదులు తరత్వాన్నీ గ్రహించి ముందుకు వెళ్ళాలిగానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు వాటిలోనేచిక్కుకొని అక్కడే నిలబడరాదు. ఒకసారి మునిపు వేళ అయింది. కొందరు భక్తులు శ్రీ రామకృష్ణులతో బహుశ మీరిప్పుడు సంధ్యవార్చుకుంటారేమో! అన్నారు. అప్పుడు శ్రీ రామకృష్ణులు వారితో లేదు అలాంటిది ఏమీ లేదు. అవన్నీ ప్రాథమిక దశలో కాస్తో కూస్తో చేయవలసి ఉంటుంది. అటు పిమ్మట పంచపాత్ర ఉద్ధరిణి పుచ్చుకొని సంధ్యావందనాది కర్మలు, నియమనిష్టలు పాటించవలసి అవసరం లేదు అన్నారు. (పుట 232 శ్రీరామకృష్ణ కథామృతం-01)

**- రాచమడుగు శ్రీనివాస్**

ఆధ్యాత్మికం

# చేపల ఫ్రై రుచిగా..

• ముందుగా చేప ముక్కలను 20 నిమిషాలు పాలలో నానబెట్టా, తర్వాత పాలు తీసేయాలి. ఇలా చేయడం వల్ల నీచు వాసన తగ్గడమే కాకుండా అదనపు రుచి వస్తుంది.

• చేపముక్కలకు మసాలా పట్టించేటప్పుడు కొద్దిగా శనగపిండి లేదా బియ్యప్పిండిని జోడిస్తే.. ఫ్రై కరకలడుతుంది.

• ఉల్లిపాయల్లో తగినంత తేమ ఉంటుంది కనుక మసాలా పేస్ట్‌ను గ్రైండ్ చేసేందుకు నీళ్ల అవసరం లేదు. దానికి బదులు చెంచా నిమ్మరసం ఉపయోగించవచ్చు.

• ఉల్లి, అల్లం, వెల్లుల్లి పేస్టు, పసుపు, కారం ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, ఉప్పు కలిపి ముద్దలా చేయాలి. చేపముక్కలకి ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట ఫ్రిజ్‌లో పెట్టాలి. 4.ఫిష్ ఫ్రై యథాతథంగా చేపలతో చేయొద్దు, చేపలను ముక్కలుగా కోసి చేస్తేనే భాగుంటుంది. దీనికి ఎక్కువ నూనె అవసరం లేదు.

• నూనె మరీ వేడిగా ఉంటే నానబెట్టిన చేప ముక్కలు పాత్రకు అంటుకుంటాయి. తగినంత సెగలో వేయించాలి.

•. ఎక్కువ మోతాదులో చేయాల్సివస్తే అనీ ఒకసారే వద్దు. కొన్ని కొన్ని ముక్కల చొప్పున వేయించండి. ఎక్కువ మొత్తంలో ముక్కలు వేసేనత నూనె ఎక్కువ పీల్చుకుంటుంది. పైగా ముక్కలు సరిగా వేగవు.

•. చేపముక్కలను రెండు వైపులా బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. వహ్వా అనిపించే రుచి రావాలంటే పావుగంట పడుతుంది. ◻



# పెద్దవారిని పలకరిస్తున్నారా !

**ఇంట్లో నానమ్మను ఉపయోగపడని సామానుగా పోలుస్తూ.. పిల్లలు హేళన చేస్తుంటారు. అలాగే భావిస్తూ వాళ్లకు పలక రింపు కరవైతే ఇంటిల్లిపాదీ మధ్య ఉంటూనే వృద్ధులు ఒంటరి తనాన్ని అనుభవిస్తారు. గతకాలానికి సంబంధించిన వివేసా లను మనకు అందించే వారధుల్లాంటి పెద్ద వాళ్లను సంరక్షిం చాలి. అప్పుడే మరింత కాలం వాళ్లు సంతోషంగా జీవిస్తారు.**

ఏదైనా ప్రత్యేకదినం లేదా నూతన సంవత్సరం అంటూ జీవితంలో తీర్మానాల పట్టిక తయారు చేస్తుంటాం. కెరియర్, ఆరోగ్యం కోసం ఇకపై ఎలా ఉండాలో ప్రణాళిక లు వేసుకుంటాం. అలాగే ఇంట్లో వృద్ధుల సంరక్షణ కోసంకూడా మనకు మనం కొన్ని తీర్మానాలు చేసుకోవాలి. ఇంటిల్లిపాది ఉండగా, ఎవరో ఒకరే కాకుండా ప్రతి ఒక్కరూ



వాళ్లతో ఆత్మీయంగా ఉండాలి. ముఖకవళికలను బట్టి వారి మనసులో ఏముందో గుర్తించడం పిల్లలకూ నేర్పించాలి. శారీరక, మానసికారోగ్యానికి సంబంధించి వారిలో కలిగే చిన్న మార్పును కూడా కనిపెట్టాలి. రోజులో వాళ్ల కోసం కొంత సమయాన్ని కేటాయించాలని తీర్మానం చేసుకుంటే, ఆ సంభాషణలో వారి మనసు అర్థమవుతుంది. పలకరించి కాసేపు మాట్లాడితే చాలు. వారి మనసులో గూడుకట్టుకున్న ఒంటరితనం క్షణాల్లో దూరమవుతుంది.

**అనుభవాలను చెప్పిస్తే..** రోజు వారి నుంచి ఒక జీవితానుభవాన్ని అడిగి తెలుసుకోవాని మనకు మనమే తీర్మానం చేసుకోవాలి. కనీసం వారికి తెలిసిన వ్యక్తుల గురించి వాట్లాడమనడం లేదా ఏదైనా పౌరాణికగాథను చెప్పమనడం.. వంటివన్నీ వారిని మానసికంగా ఉత్తేజితులను చేస్తాయి. ఉత్సాహంగా గతకాలాన్ని నెమరువేసుకుంటారు. అప్పటి అనుభవాలను పంచుకుంటారు. అది వారిని సంతోషంగా ఉంచి ఆరోగ్యాన్ని పెంచుతుంది.

**కాసేపు నడిస్తే...** ఇంటి వరండా లేదా గార్డెన్‌లో పది నిమిషాలు వారిని నడిపించాలనే తీర్మానం తీసుకోవడం కూడా మంచిది. అది వారికి వ్యాయామం అవుతుంది. చెట్ల మధ్య నడిచేటప్పుడు వాళ్ల మనసంతా తేలికగా మారుతుంది. గతంలో వారు చేపట్టిన బాధ్యతలు, పిల్లల పెంపకంలో వాళ్లు తీసుకున్న జాగ్రత్తలను ప్రశంసిస్తూ, ప్రస్తుతకాలంలో వారు గుర్తించిన మార్పులను చెప్పమనాలి. ఇప్పటి పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు సలహాలు, సూచనలూ తీసుకోవాలి. ఇవన్నీ వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయి. తామెందుకూ పనికిరావడంలేనే ఆత్మన్యూనత ఉంటే దాన్నుంచి బయటపడతారు.

**స్నేహం చేయాలి..** వాళ్ళను స్నేహితులుగా స్వీకరించాలి. ప్రేమించాలి. కెరియర్ లేదా నిత్యజీవితంలో ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనలను వారితో పంచుకోవచ్చు. సమస్య వివరించి పరిష్కారాన్ని చెప్పమంటే చాలు. అనుభవంతో వాళ్లందించే సలహాలూ ఎంతో ఉపయోగ పడతాయి. జీవితంలో లక్ష్యాలను చేరుకునేలా చేస్తాయి. వారిని అనుభవాలు పాఠాలై ముందుకు నడిపిస్తాయి. వారి నుంచి దొరికే నిస్వార్థమైన ప్రేమతో మనకూ కష్టం వస్తే చెప్పడానికి ఒకరున్నారనే భరోసావస్తుంది. ◻

## గెలుపోటములు సర్వసాధారణమే



రైల్వేకోడూరు ,జూన్ 10,ప్రభాతవార్త:
మా.ఈ ఎమ్మెల్యే కొరముట్ల.రాజీకాయ జీవితాలలో గెలుపు ఓటములు సర్వసాధారణమేనని రైల్వేకోడూరు తాజా మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు.సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ తాను మొన్న జరిగిన ఎన్నికలలో ఓటమి జరిగిన విషయం విధితమే. అయితే నియోజకవర్గ ఓటర్లు తన పట్ల ఆదరాభిమానాలు చూపించారని ఆయన అన్నారు. ముఖ్యంగా గెలిచిన వారికి అభినందనలు అని,అభివృద్ధిలో పోటీపడి పనిచేసి మంచి పేరు సంపాదించుకోవాలని ఆయన అన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో తాను పనిచేసిన అన్ని రోజులు అభివృద్ధిని సాధించానని అన్నారు.ముఖ్యంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఓటర్లు దాదాపు 60000 వచ్చాయంటే ఎంతో అభినందనీయమని అన్నారు.ముఖ్యంగా వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకుంటామని అన్నారు. రాజకీయాలలో సర్వ సాధారణంగానే గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కక్ష సాధింపులు తదితర వాటికి స్వస్తి పలకాలని శ్రీనివాసులు అన్నారు. తాను చేసిన పనులలో పెండింగ్లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అన్నారు.తనకు సహకరించిన నాయకులు కార్యకర్తలకు ఎప్పుడూ రుణపడి ఉంటారని ఆయన అన్నారు.2029 లో గెలుపుకు శ్రీకారం చుట్టాలని ఆయన పాల్గొన్న వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి మండల ఉపాధ్యాక్షులు రామిరెడ్డి ధ్వజరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు సిహెచ్ రమేష్,జడ్పిటిసి పాలెం కోట రత్నమ్మ చంద్ర,సర్పంచులు దార్ల చంద్రశేఖర్, ఆనాల చంగల్ రెడ్డి,వైయస్ కరిముల్లా, షఫీ, సలాం, రాజా, కె.రమణారెడ్డి,డి రాజారెడ్డి కృష్ణారెడ్డిమారెళ్ళ రాజేశ్వరి,ప్రతాపరెడ్డి శివారెడ్డి, సుధాకర్ రాజు,కుప్పాల జ్యోతి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## తండ్రికి తగ్గ తనయుడు నందమూరి బాలకృష్ణ

వేంపల్లె, జూన్ 10, ప్రభాతవార్త ః
తండ్రి ఎన్టీఆర్‌కు తగ్గ తనయుడు నందమూరి బాలకృష్ణ అని ఆయన అభిమానులు కొనియాడారు. వేంపల్లెలో నందమూరి బాలకృష్ణ 64వ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి షబ్బీర్ ఆఫీస్‌లో తెదేపా యూత్ చైతన్యకుమార్, యాసిన్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర మైనార్టి కార్పొరేషన్ ఎస్ఎండి షబ్బీర్‌ను అతిథిగా పిలిచి అతనిచేత కేకు కట్ చేయించారు. ఈ సందర్భంగా షబ్బీర్, జిల్లా రైతు అధ్యక్షుడు అన్నారెడ్డి బాలస్వామిరెడ్డిలు మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ నటనలో తనదైన రీతిలో నటిస్తూ అలాగే రాజకీయాల్లో కూడా రాణిస్తూ తండ్రికి తగ్గ తనయుడుగా పేరు సంపాదించుకున్నారన్నారు. తనకు జన్మనిచ్చిన తల్లి జ్ఞాపకార్థంగా క్యాన్సర్ రోగులకు ఉచితంగా వైద్యం చేయించడానికి హైదరాబాదులో బసవతారకం హాస్పిటల్ నిర్వహిస్తూ కొన్ని వేల మందికి ఉచితంగా వైద్య సదుపాయాలు అందిస్తున్న ఏకైక వ్యక్తి మన బాలకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూల అల్లాబక్షు, రామగంగిరెడ్డి, గోటూరు నాగభూషణం, షేక్ ఇలియాస్, మహబూబ్ షరీఫ్, సయ్యద్ పీరా, గోటూరు సుబ్బరాయుడు, ఫయాజ్, పాపిరెడ్డి, మస్తాన్ కెకె, డాక్టర్ కరిముల్లా, జగన్, అరుణ్‌కుమార్, రాజగోపాల్, టీడీపీ యూత్ గంగాధర్‌రెడ్డి, మహేంద్ర, షాకీర్, సాంబ, జిలాన్, రాజు, మహమ్మద్, అమానుల్లా, తదితరులు పాల్గొని బాలయ్య పుట్టినరోజు ఘనంగా నిర్వహించారు.

## దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా



**జాతీయ రహదారి ఆనుకొని ఉండడంతో లక్షల్లో విలువ**

సిద్దవటం, జూన్ 10, ప్రభాతవార్త:
మండల పరిధిలోని బొగ్గుడి వారి పల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి ఆనుకొని పెద్దపల్లి గ్రామం పొలం సర్వే నెంబర్ 100 నందు 2 ఎకరాలకు పైబడి ప్రభుత్వ భూమి ఉందిజ రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 100లో కొన్ని సబ్ డివిజన్ లాగా చేసి ప్రభుత్వ విస్తీర్ణములను ఏర్పాటు చేయడంపై మర్మమేమిటో రెవెన్యూ అధికారులకు ఎరుక. 100సర్వే నెంబర్లో కొన్ని సబ్ డివిజన్‌లలో ప్రభుత్వ విస్తీర్ణంలోనే దర్జాగా ప్రభుత్వ స్థలం ఆక్రమణలు చేస్తున్న రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ప్రభుత్వ ఆస్థలను కాపాడే విశయంలో విఫలమయ్యారని పలువురు బహిరంగంగానే తెలుపుతున్నారు. జాతీయ రహదారి పక్కనే లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూములకు రక్షించాల్సిన అధికారులే పట్టించుకోకుండా ఉండటంతో ఇదే అదునుగా భావించిన భూ అక్రమణదారులు ప్రభుత్వ భూములను అందిన కాడికి దోచుకుంటూ ఉన్న తీరుపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బొగ్గుడి వారి పల్లె గ్రామ సచివాలయానికి కూత వేటు దూరంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములు కబ్జా జరుగుతుంటే సచివాలయ సిబ్బంది ఏం చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. మండల పరిధిలో ప్రతి నిత్యం ఏదో ఒక చోట భూకబ్జాలుజరుతుతూనే ఉన్నాయంటే రెవెన్యూ యంత్రాంగం ఏ స్థాయిలో పనిచేస్తుందో ఇట్లే చెప్పొచ్చు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి విలువ కలిగిన ప్రభుత్వ ఆస్థులను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పలువురు తెలుపుతున్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఖాజీపేట, జూన్ 10, ప్రభాతవార్త:
మండల పరిధిలోని ఖాజీపేట తెలుగుదేశం మైనారిటీ నాయకులు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను సోమవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాతో సత్కరించారు. సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ త్వరలో శాసనసభ్యులుగా తను బాధ్యతలు చేపట్టి అన్ని గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టి ప్రతి గ్రామ సమస్యలను పరిష్కరించి నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాల అభివృద్ధికి కృషి చేస్తానని తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధారం ఖదీరుల్లా, కేకే బ్రదర్స్, మైనార్టీ నాయకులు, నాగశివారెడ్డి, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



## కె.యస్.ఆర్.ఎం కళాశాల "సర్వీస్ నౌ" సంస్థ మధ్య కుదిరిన ఎంఓయూ

కడప కార్పొరేషన్, జూన్ 10, ప్రభాతవార్త:
బిటెక్ 3వ సంవత్సరం చదువుతున్న విధ్యార్థిని విద్యార్థులకు సర్వీస్ నౌ వారిచే సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ అందించడం కొరకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్వీస్ నౌ డైరెక్టర్ జి.భాస్కర్ మాట్లాడుతూ సర్వీస్ నౌ అడ్మినిస్ట్రేషన్ అండ్ అప్లికేషన్ డెవలపర్ కోర్సెస్ చేయడం వలన విద్యార్థిని, విధ్యార్థులకు అధునాతన సాంకేతిక నైపుణ్యంతో పాటు టీసీఎస్, అసెంచర్, క్యాప్ జెమిని లాంటి ఎంఎన్‌సీ కంపెనీస్‌లో ఉపాధి అవకాశాలు పొందడానికి దోహదం చేస్తాయని మరియు ఏపీలోని ప్రైవేట్ అటోనోమోస్ కళాశాలలో ఇటువంటి అవగాహణ కార్యక్రమం మొదటిది అని సద్వినియోగ పరుచుకోవాలని కరస్పాండెంట్ కే.రాజేశ్వరి,వైస్ చైర్మెన్ మదన్‌మోహన్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే. చంద్ర ఓబుళరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నాగేశ్వర ప్రసాద్, సీనియర్ టిపిఓ ఆర్.నాగరాజు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్‌కుమార్, విధ్యార్థులు పాల్గొన్నారు.



## వైభవంగా ప్రారంభమైన శ్రీవారి దశమి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు



బద్వేలు అర్బన్ , జూన్ 10 ప్రభాతవార్త :
బద్వేలు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో వెలసిన శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయం దశమవార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నాడు కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి నవకళశ స్నపనం అభిషేకం, సాయంకాలం విశ్వకేశారాధన, పుణ్యహావచనం, రక్షాబంధనం, మృత్యుంగ్రహం, అంకురార్పణం, వాస్తుహోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మంగళవారం నాడు ధ్వజారోహనం, కుంభ ప్రతిష్ట, అగ్నిప్రతిష్ట, నిత్యహోమం ఉత్సవబలి, సాయంకాలం శేషవాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిస్తారని దేవాదాయశాఖ ఈవోశివయ్య, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఐదురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో బద్వేలు మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ స్వామివారి దశమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరారు. ఈ సంవత్సరం అత్యంత వైభవోపేతంగా శాస్త్రోకంగా చేపట్టడంజరుగుతుంది. కావున భక్తులందరూ స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కాగలరన్నారు.

## పేరు మీరు మారుస్తారా? - మేము మార్చాలా?

**- తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూధన్‌రెడ్డి**

పులివెందుల, జూన్ 10, ప్రభాతవార్త ః
శ్రీకృష్ణదేవరాయల కాలంలో పులివెందుల పట్టణంలో నిర్మించిన శ్రీ రంగనాథస్వామి దేవస్థానం సమీపంలో నిర్మించిన కూరగాయల మార్కెట్‌కు శ్రీరంగనాథస్వామి కూరగాయల మార్కెట్‌గా పేరు మున్సిపల్ కమీషనరు, పాలకమండలి కలిసి నిర్ణయం తీసుకుని మారుస్తారా లేక మేము మార్చాలా అంటూ తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూధన్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని తెదేపా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌కు రంగనాథస్వామి కూరగాయల మార్కెట్‌గా పేరు ఉండేదన్నారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా రంగనాథస్వామి కూరగాయల మార్కెట్‌కు బదులుగా వైఎస్ఆర్ కూరగాయల మార్కెట్‌గా మార్చడం జరిగిందని, దీనిపై భాజపా, హిందూ పరిషత్ వేదిక, తేదపాలు అభ్యంతరం చేస్తూ గతంలో కమీషనరుకు వినతిపత్రం కూడా అందించారన్నారు. ఈ కూరగాయల మార్కెట్ పేరును మున్సిపల్ పాలకమండలి సమావేశంలో కౌన్సిలర్లు మారుస్తున్నట్లు తీర్మానం చేసి మార్చాలని, లేనిపక్షంలో కూటమి ఆధ్వర్యంలో అధికారికంగా పేరు మార్చేలా చేస్తామని తూగుట్ల మధు అన్నారు. మన పులివెందుల ప్రాచీనత, ప్రాధాన్యతను తెలిపే శ్రీరంగనాథస్వామి పేరును కచ్చితంగా పెట్టాలని, దీనిపై గతంలో ధర్నాలు, ర్యాలీలు చేశారన్నారు. అప్పుడు అధికారులు తప్పకుండా పేరు మారుస్తామని మాట ఇచ్చారన్నారు. కానీ కూరగాయల మార్కెట్ పేరును వైఎస్ఆర్ మార్కెట్‌గానే ఉంచారన్నారు. త్వరితగతిన పులివెందుల మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ చర్చించుకుని కచ్చితంగా పేరు మార్చాలని, లేనిపక్షంలో తామే రంగనాథస్వామి కూరగాయల మార్కెట్‌గా మారుస్తామని హెచ్చరించారు. ప్రజాభిప్రాయం మేరకు పేర్లు ఉండాలి కానీ పార్టీలకు, వ్యక్తులకు అనుకూలమైన పేర్లు ఉండరాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కొంతమంది పులివెందులలోని మున్సిపల్ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాలకు అధిష్టానం మెప్పుకోసం రంగనాథస్వామి కూరగాయల మార్కెట్‌కు వైఎస్ఆర్ కూరగాయల మార్కెట్‌గా మార్చారన్నారు. గతంలోనూ ఈ కూరగాయల మార్కెట్‌కు ఎంతో ప్రాచుర్యం ఉందని వైకాపా నాయకులు వారికి ఇష్టం వచ్చిన రీతిలో పేర్లను మార్చుకుంటూ పోయారని, ఇకపై అలాంటివి కూటమి పాలనలో సాగవన్నారు.

## శివోహం ఆధ్వర్యంలో అన్నదానం



ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 10, ప్రభాతవార్త:
శివోహం అన్న ప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో కీర్తిశేషులు మూల వెంకటరామిరెడ్డి రిటైర్ ఆంధ్ర బ్యాంక్ మేనేజర్ జ్ఞాపకార్థం భార్య మూల లక్ష్మిదేవి కుమారులు మూల శ్రీకాంత్ రెడ్డి, మూల సుమంత్ రెడ్డి, అమెరికా కోడళ్ళు లక్ష్మిప్రియ, కుమార్తె జ్యోతి మనవళ్లు మూలె అర్జున్ రెడ్డి, మూల ఆర్యన్ రెడ్డి గార్ల సహకారంతో సోమవారం అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం నందు అన్నప్రసాద సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 400సైగా భక్తులు, నిరుపేదలకు ఉచిత అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఆ పరమ శివుని కరుణా కటాక్ష వీక్షణములు ఆ కుటుంబసభ్యులకు ఎల్లవేళలా కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ శివోహం అన్న ప్రసాదం సేవా సంఘం ప్రతి సోమవారం ఏర్పాటుచేసే అన్నప్రసాద సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శివోహం అన్నప్రసాద సేవ సంఘం అధ్యక్షులు శెట్టిపల్లె రాం ప్రసాద్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూల శ్రీకాంత్ రెడ్డి, మూల లక్ష్మిప్రియ, మనువడు మూల అర్జున్ రెడ్డి, గజ్జల వెంకటేశ్వర్ రెడ్డి, శివోహం అన్న ప్రసాద సేవాసంఘం ఉపాధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి, ఎంవి నారాయణ, ప్రధానకార్యదర్శి విజయ్‌కుమార్, లింగారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో భవణ నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్దరణ చేయాలి

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 10, ప్రభాతవార్త:
భవణ నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్‌ను విడుదల చేయాలని, దేశవ్యాప్తంగా ఒకే తరహాలో అమలు జరుగుతున్న మాదిరిగా మన రాష్ట్రంలో కూడ భవణ నిర్మాణ కార్మికులకు సంక్షేమ పదకాలు అమలు చేయాలని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని ప్రొద్దుటూరు ఏరియా లేబర్ ఆఫీస్ నందు ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంస్థ ప్రొద్దుటూరు ఏరియా సమితి వినతిపత్రం ఇచ్చారు. ఈ సంధర్భంగా ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం ప్రొద్దుటూరు ఏరియా సమితి ఉపాధ్యక్షులు శేశారెడ్డి,ససహాయ కార్యదర్శులు సత్యరాజు, సుదర్శన్, ప్రొద్దుటూరు ఏరియా ప్రధాన కార్యదర్శి పూసల చిన్న ఓబన్న మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2006 సంవత్సరంలో సంక్షేమ బోర్డు ప్రారంభమై 2019 తరువాత గత ప్రభుత్వం సంక్షేమ బోర్డులు నిర్వీర్యం చేయడం జరిగిందని, ఆంధ్రప్రదేష్లఓ కూటమి తరపున మేనిఫెస్టోలో భవణ నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని పెట్టడం జరిగినందున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లేబర్ డిపార్ట్‌మెంట్‌లో సంక్షేమ కార్డులో పొందిన 22లక్షల మంది కార్మికులే కాకుండా కార్డులు పొందని కార్మికులు సుమారు 30లక్షల మంది విరిసి 50లక్షల మంది ఉన్నారు. భవణనిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్దరించి పెండింగ్‌లో ఉన్న క్లైయిములకు నిధులు మంజూరు చేసి కార్మికులను ఆదుకొనుటకు తగు చర్యలు త్వరితగతిన చేపట్టవలసిందిగా సంక్షేమ బోర్డులో అమలుపరిచిన లబ్ది వివరములు పనిచేయు ప్రదేశములో కార్మికులు ప్రమాదములు వలన మరణించిన వారికి లేక సహజ మరణం చెందిన లేదా ప్రమాదం వలన శాశ్వత అంగవైకల్యం లేదా పాక్షికంగా అంగవైకల్యం కలిగిన కార్మికులు లేదా వారి కుటుంబ సభ్యులకు ఇచ్చే పారితోషికములతో పాటు భార్య లేదా కుమార్తెలకు సంబంధించిన రెండు కాన్పులకు ఇచ్చే పారితోషికములు మరియు కార్మికుల పిల్లలకు ఇచ్చే స్కాలర్‌షిప్ల్ నిలిపివేసి ఉన్నారని అన్నారు. కార్మిక సంక్షేమ బోర్డును పటిష్టంగా అమలు చేసి పెండింగ్‌లో ఉన్న 40వేల క్లైములను వెంటనే పరిష్కరించి ఆ తర్వాత క్లైములకు కూడ నిధులు మంజూరు చేసి, సంక్షేమ బోర్డును కాపాడి కార్మికులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



## టీడీపీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం





చాపాడు, జూన్ 10, ప్రభాతవార్త:
ప్రముఖ పుణ్యక్షేత్రం అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం నందు ప్రతి సోమవారం జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా సోమవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సర్వజన కళ్యాణ మండపం నందు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా బ్రహ్మంగారి మఠం ఈశ్వరిదేవి మఠాధిపతి ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేశారు. ఈ సంధర్భంగా స్వామి మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం గొప్ప కార్యక్రమం అని దీని వలన దేశం సస్యశ్యామలం, సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. ప్రతి సోమవారము చెన్నూరు శ్రీనివాసగోవిందా సేవాసమితి ఆధ్వర్యంలో సేవ చేయుటకు సిబ్బంది రానున్నట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మిల్లు శ్రీను, మాజీ జడ్పీటీసీ మేకల బాబు, అల్లాడుపల్లె వీరారెడ్డి, పెరుగు వీరనారాయణ యాదవ్, గుత్తి వీరనారాయణ, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

**అమ్మ వృద్దాశ్రమంలో**

## వస్త్ర దానం పండ్లు పంపిణీ



మైదుకూరు రూరల్,జూన్ 10,ప్రభాతవార్త:
మంబడల పరిధిలోని భూమాయపల్లె సమీపంలో గల అమ్మ వృద్దాశ్రమంలో సోమవారం చియ్యపాడు గ్రామానికి చెందిన స్వర్గీయ టీచర్ జానయ్య ధర్మపత్ని లలితమ్మ జ్ఞాపకార్థం వారి పెద్ద కుమార్తె ఇందిరమ్మ అల్లుడు సుబ్బన్న మరియు వారి కుమారుడు కండక్టర్ తప్పేటుత్తానపాదుడు వీరి ధర్మపత్ని సుబ్బరామంజనమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బియ్యం ప్యాకెట్ వస్త్ర దానము పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు సాంబయ్య మరియు వెంకటరమణ మరియు తప్పేట హరిబాబు,టిడిపి యువ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

**జనసేన గెలుపునకు**

## కృషిచేయడం అభినందనీయం

బద్వేలు అర్బన్ , జూన్ 10 ప్రభాతవార్త :



కూటమి పార్టీ అయిన జనసేన గెలుపునకు 5 రాష్ట్రాల బలిజ సేవా సంఘం నాయకులు దాసరి రాము చేసిన కృషి ఎనలేనిదని బద్వేలు టీడీపీ సీనియర్ నాయకులు కొంకుల రాంబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో బలిజల సంక్షేమం కోసం ఆయన ఎంతో కృషిచేశారని కొనియాడుతూ సోమవారం గుంటూరులోని ఆయన నివాసానికి చేరుకున్న రాంబాబు ఆయనను సత్కరించారు. రాష్ట్ర బలిజల సంక్షేమం కోసం చేస్తున్న కృషి అభినందనీయమని బద్వేలు బలిజ సంఘం సభ్యునిగా తాను గర్విస్తున్నానన్నారు.

**చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని విజయవంతం చేయాలి:** ఈ నెల 12న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా టీడీపీ అభిమానులు, కార్యకర్తలు ఎద్ద ఎత్తున ఈకార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇందలు భాగంగా ఆయన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు కమలాపురం ఇన్‌చార్జి నరసింహారెడ్డితో కలిసి గన్నవరం ఎయిర్‌పోర్టు ఎదురుగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి చేస్తున్న సభ వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. నూతన ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

## చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షునిగా నరసింహులు

చాపాడు, జూన్ 10, ప్రభాతవార్త:



మైదుకూరు నియోజకవర్గ జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షునిగా చాపాడు మండలం రేపల్లె గ్రామానికి చెందిన నరసింహులును నియమించినట్లు పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంధర్భంగా ఆంధ్రప్రదేశ్ బీసీ మహాసభతో పాటు పలు ప్రజాసంఘాలలో ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించిన నరసింహులుకు మైదుకూరు నియోజకవర్గ పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పినట్లు ఆయన తెలిపారు. అనంతరం నరసిహులు మాట్లాడుతూ తనపై నమ్మకాన్ని ఉంచి నియోజకవర్గ పార్టీ బాధ్యతలు అప్పజెప్పినందుకు పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు.

## సహకార సంఘం అధ్యక్షుల పదవికి రాజీనామాలు

రామాపురం, జూన్ 10, ప్రభాతవార్త:



మండలంలోని సరస్వతిపల్లి సహకార సంఘం అధ్యక్షుడు అయోధ్యపురం పెద్దిరెడ్డి రాచపల్లిలోని కొలిమివాండ్లపల్లె సహకార సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డిలు సోమవారం తమ పదవులకు రాజీనామా చేసినట్లు సహకార సంఘం కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా అధికారంలోకి రావడంతో వైఎస్ మద్దతు దారులైన వారు రాజీనామా చేసినట్లు ఆయన అన్నారు.

**వరదరాజుల రెడ్డికి**

## మంత్రి పదవి ఇవ్వాలి

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 10, ప్రభాతవార్త:
ప్రొద్దుటూరు పట్టణం కామనూరు గ్రామంలో సోమవారం మన ప్రజా సేవాసమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని ఘనంగా సన్మానించారు. మన ప్రజా సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆయూబ్ ఖాన్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలుపొంది అందరి మన్ననలు పొంది ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వరదరాజుల రెడ్డికి నూతన మంత్రి వర్గంలో నూతన ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ఇంతవరకు మంత్రి పదవి దక్కలేదు కనుక ఈ సారి వరదరాజుల రెడ్డికి మంత్రిగా చోటు కల్పించాలని కోరారు. అలాగే పట్టణంలో మార్కెట్ త్వరగా పూర్తిచేసి పాతవారికి వారి బండలను వారికి అప్పగించాలని, అలాగే పట్టణంలో ఎన్నో సమస్యలపైన దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మన ప్రజాసేవా సమితి ఉపాధ్యక్షుడు బీటెక్ బాషా, షేక్ సలీం, సహాయ కార్యదర్శి ముస్తఫా, ట్రెజరర్ మహమ్మద్, సభ్యులు రమేష్, చరణ్, మునయ్య, యూసుఫ్, పఠాన్ పాల్గొన్నారు.

